వేసవి దుక్కులు.. దండిగా దిగుబడులు

- చీడ,పీడల బారి నుంచి పంటలకు రక్షణ
- సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు ఖాయమంటున్న శాస్త్రవేత్తలు
- సంప్రదాయ సాగుకు మొగ్గు చూపాలంటున్న అధికారులు





గడ్డమణుగు గ్రామ శివారులో సంప్రదాయ పద్ధతిలో వేసవి దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్); మునగపాడు గ్రామ శివారులో ట్రాక్టరుతో వేసవి దుక్కి దున్నుతున్న రైతు

జి.కొండూరు: వర్షాలు పడగానే దుక్కులు దున్ని వెంటనే పైర్లు వేయడం వల్ల పంట ఎదుగుదల లోపించి చీడ, పీడల బారిన పడి పెట్టిన పెట్టుబడి రాక రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నారు. సాగును వేసవి దుక్కులతో ప్రారంభించి సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే రైతులు అధిక దిగుబడులను పొందవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు ఇవి..

- రబీ పంట పూర్తవగానే ఏప్రిల్, మే నెలల్లో నేలను లోతుగా దున్నాలి. దీనివల్ల భూమికి నీటిని పీల్చుకునే శక్తి అధికమవుతుంది.
- వర్షాలకు ముందు భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షాలకు నీరు భూమిలోకి ఇంకిపోయి తేమ శాతం పెరుగుతుంది.
- లోతైన వేసవి దుక్కులతో పంటల వేర్లు లోతుగా పోయి వర్షాధార పంటలు బెట్టకు గురైనప్పుడు నేల లోపలి పొరల్లోని తేమను, పోషకాలను గ్రహించి బెట్టను తట్టుకుంటాయి. - వేసవిలో లోతు దుక్కి చేసినప్పుడు భూమి గుల్లబారి, గట్టి పొరలు ఏర్పడకుండా మెత్తగా తయారవుతుంది.
- లోతు దుక్కులతో ఖరీఫ్, రబీ పంట అవశేషాలు, కలుపు మొక్కలు, పంట మొక్కల నుండి రాలిన ఆకులు వంటి సేంద్రియ పదార్థాలు ఎరువుగా మారతాయి.
- నేలలో తేమ శాతం పెరగడంతో పాటు సేంద్రియ కర్బన శాతం, పోషక పదార్థాలు పెరుగుతాయి.
- వేసవిలో లోతు దుక్కులు దున్నే ముందుగా భూమిలో పశువుల ఎరువు గానీ, కంపోస్టు గానీ, చెరువు మట్టిని గానీ వెదజల్లడం వల్ల నేల సారవంతమవుతుంది.
- తుంగ, గరిక లాంటి మొండి జాతి కలుపు మొక్కల వేర్లు, దుంపలు, ఇతర గడ్డి జాతి మొక్కలు, ద్విదళ బీజ జాతి మొక్కల విత్తనాలు కూడా బయటపడి వేసవిలో ఉండే అధిక వేడికి నశించిపోతాయి.
- భూమిలో దాగి ఉన్న చీడ పీడల కోశాలు, గుడ్లు, శిలీంధ్ర జాలాలు బయటపడి అధిక ఉష్ణోగ్రతలకు నశిస్తాయి.
- ఈ దుక్కుల వల్ల బయట పడిన ప్యూపాలను, గుడ్లను కొంగలు, కాకులు వంటి పక్షులు తిని నాశనం చేస్తాయి.
- రైతులు రెండు లేదా మూడేళ్లకు ఒక్కసారైనా వేసవిలో 20 నుంచి 30 సెంటీ మీటర్ల లోతు దుక్కులను చేసుకోవటం వల్ల అనేక లాభాలు పొంది, వర్షాధార పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు వీలుకలుగుతుంది.

నియోజకవర్గంలో సాగు ఇలా..

మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు మండలంలో 12,800 హెక్టార్లు, మైలవరం మండలంలో 8,800 హెక్టార్లు, రెడ్డిగూడెం మండలంలో 13,600 హెక్టార్లు, ఇబ్రహీంపట్నం మండలంలో 3,200 హెక్టార్లు, విజయవాడ రూరల్ పరిధిలో 2,800 హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంది. నియోజకవర్గంలో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న అధికంగా పండిస్తుంటారు. పంట పూర్తయిన తర్వాత ఎక్కువ మంది రైతులు పంటల అవశేషాలను భూమిలో కలియదున్నకుండా కాల్చివేసి భూమిని అలా వదిలేస్తున్నారు. పంటల అవశేషాలను కాల్చకుండా పంట పూర్తవ్వగానే భూమిలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనం పెరడంతో పాటు వేసవి దుక్కుల వల్ల మేలు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

అవగాహనతో సాగు చేపట్టాలి



ఖరీఫ్ సాగుకు ముందు రైతులు వేసవి దుక్కులు దున్నుకోవాలి. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తే రసాయనిక ఎరువుల వాడకం తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చు. సాగు చేసే ముందు నేల స్వభావాన్ని బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలి. నీటి సౌకర్యం తక్కువగా ఉన్న భూముల్లో డ్రిప్ పద్ధతిలో మెట్ట పంటలను సాగు చేసుకోవాలి.

– ఎం రాంకుమార్, మండల వ్యవసాయాధికారి, జి.కొండూరు

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

నూజివీడు: జిల్లాలోని ముస్లింలకు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పర్వదినం త్యాగానికి, పవిత్రతకు, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. అల్లా దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ప్రతాప్ అప్పారావు రంజాన్ శుభాకాంక్షలు

నూజివీడు: పవిత్ర రంజాన్ మాసం పూర్తికానున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజుల పాటు కఠోర ఉపవాసాలు పాటించిన తరువాత ముస్లింలు ఈద్ చేసుకోవడం సంతోషకరమన్నారు. అల్లా చూపిన మార్గంలో ముస్లిములందరూ నడవాలని ఆకాంక్షించారు. ఇతరుల పట్ల ప్రేమ, కరుణ కలిగి ఉండాలని, రంజాన్ మాసంలో శక్తి మేరకు దానం చేయడం వల్ల దేవుని కృపకు పాత్రులవుతారన్నారు.

నేరాలకు పాల్పడితే రౌడీషీట్ తెరుస్తాం

తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ

తిరువూరు: పాత నేరస్తులు పదే పదే నేరాలకు పాల్పడుతుంటే వారిపై రౌడీషీట్ తెరుస్తామని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో నేర చరిత్ర కలిగిన వారికి ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడ, ఎప్పుడు నేరం జరిగినా పాత నేరస్తులపై పోలీసులు నిఘా ఉంచుతారని, సత్ప్రవర్తనతో మెలిగితే కేసుల నుంచి విముక్తులవుతారని చెప్పారు. జూదాలు, దొంగతనాలకు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు.

క్లుప్తంగా

రక్షణ గోడ లేక ప్రమాదాలు



తిరువూరు: నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ సెంటర్‌లోని అక్కపాలెం రోడ్డు మలుపులో ప్రధాన డ్రెయినేజీకి రక్షణ గోడ లేక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. డ్రెయినేజీ కారణంగా రోడ్డు ధ్వంసమైపోతుండగా, భారీ వాహనాలు జారి పడిపోతున్నాయి. రాత్రివేళలో డ్రెయినేజీని గుర్తించని ద్విచక్ర వాహనదారులు సైతం అదుపు తప్పి పడిపోతున్నారు. డ్రెయినేజీకి రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువ కట్ట ఆక్రమణదారులకు నోటీసులు



మైలవరం: మైలవరం గ్రామం పొందుగల రోడ్డులోని గుర్రం చెరువు కట్ట వద్ద కాలువ కట్టను ఆక్రమించుకుని ఇటీవల కొంతమంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దీనిపై స్పందించిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు కొలతలు వేసి కాలువ కట్ట ఆక్రమణకు గురైందని గుర్తించి మార్కింగ్ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో ఆదివారం ఆక్రమణదారులు ఆరుగురికి నోటీసులు అందజేశారు. నాలుగు రోజుల్లో ఆక్రమించి కట్టిన నిర్మాణాలను తొలగించాలని, లేకుంటే పంచాయతీ ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించాల్సి వస్తుందని రఫీ హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం

తిరువూరు: ఉగాది సందర్భంగా గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కళాకారులను సన్మానించారు. వివిధ ప్రాంతాల నుంచి 30 మంది కళాకారులను ఎంపిక చేసి సన్మానించామని కమిటీ నిర్వాహకులు నారాయణరావు తెలిపారు. రంగస్థల కళాకారులు, గాయకులు, చిత్రలేఖకులను సన్మానించిన అనంతరం కళాకారులు పౌరాణిక పద్యాలు ఆలపించారు.

శిఖా ఆకాష్‌కు ఉగాది పురస్కారం



నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన ఉగాది పురస్కారం నూజివీడు పట్టణానికి చెందిన అభ్యుదయ కవి కత్తుల కిశోర్ కుమార్ (శిఖా ఆకాష్)కు లభించింది. సాహిత్య విభాగంలో ఎంపికైన ఆయన ఆదివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా రూ.10 వేల నగదు పురస్కారం అందుకున్నారు. ఉగాది పురస్కారం అందుకున్న శిఖా ఆకాష్‌ను పట్టణానికి చెందిన పలువురు సాహితీవేత్తలు, కవులు అభినందించారు.

దైవచింతనతో మంచి ఫలితాలు



తిరువూరు: పంచాంగంలో వ్యక్తిగత జాతకాలు చూసి కంగారు పడాల్సిన అవసరం లేదని, దైవచింతనతో మంచి ఫలితాలు పొందవచ్చని శ్రీమాన్ నల్లానిచక్రవర్తుల విశలాచార్యులు అన్నారు. తిరువూరు వేంకటాచలస్వామి ఆలయం, దాసాంజనేయ స్వామి ఆలయాల్లో ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగ పఠన కార్యక్రమం నిర్వహించారు. జాతకం బాగాలేదని అశాంతికి లోను కావద్దని, మనం చేసే మంచి కార్యక్రమాలతో గ్రహస్థితిలో కూడా మార్పు రావచ్చన్నారు. విశ్వావసు నామ సంవత్సరంలో కందాయ ఫలాలు, రాశి ఫలాలు, నవ నాయక ఫలాలను విశలాచార్యులు విపులీకరించారు. అర్చకులు పార్థసారథాచార్యులు, రామకృష్ణమాచార్యులు, గోపాల కృష్ణమాచార్యులు పాల్గొన్నారు. వేంకటాచల స్వామి ఆలయంలో కల్యాణి నర్సింగ్ హోం అధినేత డాక్టర్ తాళ్లూరి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆర్య వైశ్య కల్యాణ మండపంలో, పలు వ్యాపార సంస్థల్లో నూతన దస్త ప్రారంభ పూజలు నిర్వహించారు.

వంటపాత్రల వితరణ

వత్సవాయి: చిట్యేల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ప్రతి శనివారం భక్తులకు అన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. భోజనాన్ని తయారు చేసేందుకు కావల్సిన వంట పాత్రలను మక్కపేట గ్రామానికి చెందిన దారా బోయిన వీరబాబు దంపతులు రూ.50 వేలు వెచ్చించి కొనుగోలు చేసి ఆలయానికి బహూకరించారు. కార్యక్రమంలో అర్చకులు శివరాం ప్రసాద్ శాస్త్రి, సిరికొండ సాయికృష్ణమాచార్యుల చేతులమీదుగా పాత్రలను ఆలయానికి అందజేశారు.

ఘనంగా ఉగాది వేడుకలు



పసుపు కొడుతున్న ధర్మకర్తల దంపతులు

నూజివీడు/తిరువూరు/మైలవరం: శ్రీ విశ్వావసు ఉగాది పండుగను నూజివీడు, తిరువూరు, మైలవరం నియోజకవర్గ ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఇళ్లు, షాపులను మామిడి తోరణాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తయారుచేసి రుచి చూశారు. నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని కోరుకుంటూ పూజలు చేశారు.

చాట్రాయి: చనుబండ గ్రామంలోని కోదండ రామాలయంలో స్వామికి పూజలు చేసి గ్రామంలో ఊరేగించారు. అనంతరం శ్రీ రామ నవమిని పురస్కరించుకుని స్వామి కల్యాణం సందర్భంగా పసుపు కొట్టి పంచామృతాలతో అభిషేకం చేశారు. రోటిలో కొట్టిన పసుపుని గోటితో వలిచిన బియ్యంలో కలిపి స్వామి పాదాల చెంతన ఉంచారు. బియ్యాన్ని కల్యాణం రోజున తలంబ్రాలుగా వినియోగించనున్నారు. కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెమలిలో పంచాంగ పఠనం

తిరువూరు: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు ఆదివారం సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. తెల్లవారుఝాము నుంచే వేణుగోపాలుడికి విశేషార్చనలు జరిగాయి. అనంతరం పంచాంగ పఠనం కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ శశిరేఖ, ఈఓ సంధ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- **మైలవరం:** షడ్రుచుల ద్వారా ఉగాదిని ఆస్వాదించి, కొత్త ఆశయాలు, కోరికలతో వెలుగులోకి రావాలని ప్రధానోపాధ్యాయుడు పి. గోపాల్ అన్నారు. మైలవరం ఆరో వార్డులోని ప్రాథమిక పాఠశాలలో ఉగాది సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మంచి అలవాట్లు కలిగి, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా రంజాన్ పండుగను కూడా పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్‌రావు, ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **మునునూరు:** మండల వ్యాప్తంగా ఉగాది వేడుకలు సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. అన్ని గ్రామాల ప్రజలు ఆదివారం ఉగాది సందర్భంగా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పచ్చడి రుచిని ఆస్వాదించారు. ఆలయాల వద్ద అర్చకులు పంచాంగ శ్రవణం వినిపించారు. ప్రజలంతా ఒకరికొకరు నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నూజివీడు మండలంలో..

నూజివీడు: పట్టణ, మండల ప్రజలు ఆదివారం ఉగాది పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఉగాది సందర్భంగా పెద్దలు, పిల్లలు వేకువజామునే లేచి తల స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించారు. ఇంటి ముంగిళ్లను ముగ్గులతో అలంకరించుకున్నారు. తమ ఇష్టదైవానికి పూజలు చేసి పిండివంటలు, షడ్రుచులతో ఉగాది పచ్చడి చేసుకుని ఆరగించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ నూతన సంవత్సరం సాగిపోవాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షించారు. పలు చోట్ల పంచాగ శ్రవణం నిర్వహించారు. పట్టణంలోని అమర్‌భవన్‌లో ఉగాది కవి సమ్మేళనం, సాంస్కృతిక విభావరి నిర్వహించారు. కవులు ఈమని శేషయ్య, శిఖా ఆకాష్, ఎస్‌కేడీ ప్రసాద్, కేవీ శేషయ్య, ఎంఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొని పంచాంగ శ్రవణం వినిపించారు. అనంతరం పలు పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీ అభయాంజనేయ భక్త బృందం కోలాటం ప్రదర్శించింది. కవి సమ్మేళనం అనంతరం పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జెడ్పీ హైస్కూల్ తెలుగు పండితులు దారా మోహన్‌రావుకు రాచకుళ్ల నరసింహారావు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం, ప్రజా నాట్యమండలి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



మైలవరం ప్రాథమిక పాఠశాలలో ఉగాది సంబరాల్లో చిన్నారులు



నెమలిలో పంచాంగ పఠనంలో పాల్గొన్న భక్తులు

జోగి రమేష్‌కు అభినందనల వెల్లువ



జోగి రమేష్‌ను సత్కరిస్తున్న వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు

ఇబ్రహీంపట్నం: మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయ కర్త జోగి రమేష్‌ను శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా ఆ పార్టీ మైలవరం నియోజకవర్గ నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా, పూలబొకేలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఇటీవల కాలంలో వైఎస్సార్ సీపీలో నూతనంగా పదవులు పొందిన జిల్లా యాక్టివిటీ కార్యదర్శి బొంతా సాంబశివరావు, నియోజకవర్గ బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడు మందా మధుబాబు, ఇంటలెక్చువల్ అధ్యక్షుడు నక్కా ప్రభుదాస్, ప్రచార కమిటీ అధ్యక్షుడు చెన్నూరు సుబ్బారావు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సూరిబాబు, విజయవాడ రూరల్, జి.కొండూరు మండలాల అధ్యక్షులు జడ రాంబాబు, బయ్యారపు కిశోర్‌ను జోగి రమేష్ శాలువా కప్పి అభినందించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, జి.కొండూరు జెడ్పీటీసీ మందా జక్రధరరావు, ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, మాజీ ఎంపీటీసీ వేములకొండ సాంబయ్య, కేడీసీసీ బ్యాంక్ ఉపాధ్యక్షులు వేములకొండ రాంబాబు, వేముల సీతారామయ్య, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా పుట్ట తిరునాళ్ల

కంచికచర్ల : కంచికచర్లలోని జుజ్జూరురోడ్డులో ఉన్న నాగేంద్రస్వామి పుట్ట తిరునాళ్ల ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ తిరునాళ్లకు కులమతాలకు అతీతంగా హిందువులు, ముస్లింలు అందరూ కలసి వచ్చి స్వామివారిని దర్శించుకుని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ముస్లిం మహిళలు కూడా పుట్ట తిరునాళ్లలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు స్వామివారికి పొంగళ్లు పెట్టారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు చెవిపోగులు కుట్టించారు. భక్తులు నాగేంద్ర స్వామి చిత్రపటాన్ని ప్రభపై ఉంచి ఊరేగింపుగా పుట్ట వద్దకు తీసుకువచ్చారు. భజన పాటలు, కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలవ పెదబాబుల ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు రెండు వేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు.

వాటర్ ప్లాంటుకు రూ.58 వేల విద్యుత్ బిల్లు



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని ఫెర్రీ రోడ్డులో ఓ వాటర్ ప్లాంటుకు ఈ నెలలో రూ.58,089 విద్యుత్ బిల్లు వచ్చింది. అధిక మొత్తంలో బిల్లు రావడంపై ప్లాంటు నిర్వాహకుడు కంగుతిన్నాడు. ప్రతి నెలా రూ.6 వేల నుంచి రూ.7 వేల మధ్య బిల్లు వచ్చేదని ప్లాంటు యజమాని రాంబాబు తెలిపారు. ఇటీవలి కాలంలో విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్ల వల్ల బిల్లు భారీగా పెరిగిందని అనుమానిస్తున్నాడు. ఒక్కసారిగా పెరిగిన కరెంటు బిల్లుపై పునఃపరిశీలన చేయాలని 20 రోజులుగా విద్యుత్ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో విసుగుచెంది వినియోగదారుల ఫోరంను ఆశ్రయించానని ప్లాంటు యజమాని పేర్కొన్నాడు.

సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కావాలి

లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరి



తిరువూరు: లయన్స్ క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కావాలని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. తిరువూరు లయన్స్ క్లబ్ పరిధిలో ఆదివారం జరిగిన పలు సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిమెంట్ బల్లలు, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఫైబర్ కుర్చీలు, సాయి దివ్యాంగుల ఆశ్రమంలో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఆశ్రమంలోని పేద మహిళలు, విద్యార్థులకు ఆర్థికసాయం చేశారు. ఆయన మాట్లాడుతూ 33 సంవత్సరాలుగా తిరువూరు లయన్స్ క్లబ్ పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిందని ప్రశంసించారు. తిరువూరు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పసుమర్తి వెంకటేశ్వరరావు, నాగుబండి శ్యామ్‌సుందర్, కోశాధికారి వెంకటరెడ్డి, సభ్యులు ముత్యప్రసాద్, రాజేష్‌ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల తపస్సు కాల శాంతియాత్ర



తపస్సు కాల శాంతి యాత్రలో ప్రార్థన చేస్తున్న ఫాదర్ అనిల్‌కుమార్, భక్తులు

ఇబ్రహీంపట్నం: తపస్సు కాల దీక్షలో ప్రతి ఒక్కరూ ప్రార్థన, ఉపవాసం, దానధర్మాలు చేస్తూ దేవుడు, తోటివారితో సన్నిహిత సంబంధాలు పెంచుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్సీఎం విచారణ చర్చి ఫాదర్ రెవరెండ్ బెల్లంకొండ అనిల్‌కుమార్ అన్నారు. 40 రోజుల తపస్సు కాల దీక్షలో భాగంగా స్థానిక సహాయ మాత విచారణ చర్చి నుంచి మూలపాడు సిలువగిరి వరకు ఆదివారం శాంతి యాత్ర నిర్వహించారు. ఫాదర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ 40 రోజుల దీక్ష సమయంలో దీక్షాపరులు నియమనిష్ఠలు, ఆరాధనలతో పునీతులుగా మారడం వారి జీవితాల్లో మార్పునకు నాంది అన్నారు. 65వ నంబర్ జాతీయ రహదారిపై సుమారు 7 కిలోమీటర్ల మేర జరిగిన శాంతి ర్యాలీలో సిలువలు చేతబట్టి భక్తిగీతాలు ఆలపించారు. దేవుని స్మరిస్తూ ముందుకు సాగారు. పలువురు సిస్టర్లు, వివిధ గ్రామాల సంఘాల పెద్దలు, భక్తులు ర్యాలీలో పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మైలవరం: ఎమ్మార్పీఎస్ మైలవరంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు యలవర్తి నాగరాజు, మహాజన పార్టీ మండల కమిటీ సభ్యుడు ఇంకొల్లు జమలయ్య, దూరు దాసు, కొంగల రామారావు, ఎం. సుందరం తదితరులు పాల్గొన్నారు.

- **మైలవరం:** వెల్వడం గ్రామంలోని లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో వెల్వడం ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రంలో ఉగాది పండుగ సందర్భంగా ఉగాది పచ్చడి, మజ్జిగ పంపిణీ చేశారు. సంఘ నాయకులు గూడూరు నాగిరెడ్డి, బాణావతు నరసయ్య, తోట తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని నరసింహారావుపాలెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ మందపాటి రఘుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు విస్సంపల్లి సీతయ్య తదితరులు పాల్గొన్నారు.